


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 20 సంచిక : 9 మే 2015



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


05-11-2014

విశాఖపట్నం

30-03-2015

గొల్లలమామిడాడ



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-11-2014, విశాఖపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన ఇండియాలో ఉన్న పుణ్యక్షేత్రాలలో అరుణాచలం ఒకటి, అది అగ్ని క్షేత్రం. అరుణాచలం యొక్క మోడరన్ నేమ్ తిరువణ్ణామలై. తమిళనాడులో ఎక్కువగా అణ్ణామలై, అణ్ణామలై అంటారు. అణ్ణామలై అంటే అందని కొండ. అరుణాచలం గురించి శివపురాణంలో, స్కాందపురాణంలో వైభవంగా చెప్పబడింది. కొండ దేవుడు అవుతాడా అని ఒకసారి కాళహస్తిస్వాములవారు నా దగ్గర అన్నారు. ఈ కొండ దేవుడు అని నేను చెప్పటంలేదు, శివపురాణం చెప్పింది, స్కాందపురాణం చెప్పింది. నేను చెప్పిన మాటను మీరు అంగీకరించకపోవచ్చు కాని పురాణాలను ప్రమాణంగా అంగీకరించరా అని అడిగాను. ఆయన మౌనం వహించారు. బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి నేను గొప్ప, నేను గొప్ప అని అహంకారం వచ్చి పేచీలు పడితే వారి అహంకారాన్ని అణచటానికి శివుడు ఈ రోజున వారికి జ్యోతిరూపంలో దర్శనం ఇచ్చాడు కాబట్టి దానికి గుర్తుగా ఆ కొండపై ఈ రోజున కొన్ని డబ్బాల ఆవునెయ్యితో జ్యోతిని వెలిగిస్తారు. అది జ్ఞానగిరి, శాంతగిరి. అరుణాచలాన్ని ఎవరైతే స్మరిస్తారో, ఆ రూపాన్ని ఎవరైతే ధ్యానిస్తారో వారికి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది అని పురాణాంతర్గతం. అరుణాచలంలో ఈరోజున కొన్ని లక్షల మంది గిరిప్రదక్షిణ చేస్తారు. కైలాసంలో శివుడు ఉంటాడు కాని ఇక్కడ ఆ కొండే శివుడు అని పురాణాలలో చెప్పారు. దీనికి కోరికలు నెరవేర్చే కొండ అని ప్రసిద్ధి ఉంది. గిరిప్రదక్షిణ చేయటం వలన కోరికలు నెరవేరతాయని ఒక విశ్వాసం ఉంది.

రమణస్వామికి ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఎటాచ్‌మెంట్ అంటూ

ఉంటే ఆ కొండ మీదే ఎటాచ్‌మెంట్ ఉంది. అరుణాచలం వచ్చాక ఆ కొండను విడిచిపెట్టి ఆయన ఏ తీర్థానికీ వెళ్లలేదు, ఏదీ చూడలేదు. ఇంక చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీ లేదు అన్నారు. ఆ కొండలో ఒక రాయిలాగ ఆ కొండను అంటిపెట్టుకొని ఉండిపోయారు. ఎవరైనా భక్తులు అడిగితే వారితో మాట్లాడేవారు, భక్తులు లేనప్పుడు ఆ కొండవంక అలాచూస్తూ ఉండేవారు. మీరు కూడా ఎప్పుడైనా అరుణాచలం వెళితే ఏవో బాతాకానీ మాటలు వేసుకోకుండా ఎక్కడో ఒకచోట ఖాళీ ప్రదేశంలో కూర్చుని ఆ కొండవంక చూడండి. అది జ్ఞానగిరి, మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. మీరు కొండవంక ఎక్కువగా చూస్తూ ఉంటే, ఆ కొండను ధ్యానిస్తూ ఉంటే మీ మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోయి, మనస్సుకు లోచూపు కలుగుతుంది. అంతర్ముఖమైన మనస్సు నెమ్మదిగా సన్నగిల్లి ఆత్మలో లయమైపోతుంది. ఎప్పుడైతే మనోనాశనం అయిందో మనస్సు కల్పించినటువంటి ఈ ప్రపంచం, దేహము, ఈ జన్మలు అన్నీ కూడా అణిగిపోతాయి.

పూర్వం కూడా మనం అందరం ఉన్నాం. అంటే ఈ శరీరం పుట్టకముందు కూడా మనం ఉన్నాము. ఇప్పుడు అంటే ఈ శరీరం పుట్టిన తరువాత కూడా ఉన్నాము, ఈ శరీరం చనిపోయిన తరువాత కూడా ఉంటాము. పూర్వం ఉన్నాము కాబట్టి ఇప్పుడూ ఉన్నాము. ఇప్పుడు ఉన్నాము కాబట్టి భవిష్యత్‌లో కూడా ఉంటాము. ఉండటం అనేది సహజం. ఎవడికైతే ఆశ అనేది లేదో వాడూ ఉంటాడు కాని వాడికి ఇంక జన్మలు రావు. ఆశ ఉన్నవాడికి తప్పనిసరిగా పునర్జన్మ వచ్చి తీరుతుంది, దానిని ఎవరూ ఆపుచేయలేరు. వాసనాక్షయం అయితేనేగాని ఆశ నశించదు. అందుచేత ఆశ ఉన్నంతకాలం మీకు జన్మలు వస్తూనే ఉంటాయి. మీరు చనిపోతూ ఉంటారు, తిరిగి పుడుతూ ఉంటారు. ఆశ ఎప్పుడైతే నశించిందో అప్పుడు మీరు ఉంటారు, మీ ఎగ్జిస్టెన్స్ కంటిన్యూ అవుతూనే ఉంటుంది కాని శరీరాలు ఆగిపోతాయి ఎందుచేతనంటే ఇంక మీకు శరీరాలు అవసరం లేదు. పంచదార ఫ్యాక్టరీ ఉన్నవాడిని మీకు బస్తా పంచదార కావాలా అంటే నాకు అవసరం లేదు అంటాడు. అలాగే శాంతి ప్రవాహంలో, ఆనంద ప్రవాహంలో మీరు ఊగిసలాడుతున్నప్పుడు ఇంక మీకు ప్రపంచంలో దేనిమీద ఆకర్షణ ఉండదు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. అయినా అవి ఏమీ మిమ్మల్ని ఆకర్షించలేవు, ఎందుచేతనంటే హృదయంలో ఉన్న ఆనందం అభౌతికమైనది, అలౌకికమైనది. అది ఇంద్రియాలకు, మనోదేహాలకు అతీతమైనది. లౌకిక ఆనందాలను దానితో పోల్చటానికి వీలులేదు.

మామూలుగా మనిషి కొన్ని శారీరకసుఖాలను అనుభవిస్తున్నాడు, మనస్సుతో

ఎంజాయ్ చేస్తున్నాడు. ఇలా శరీరాన్ని, మనస్సును భోగప్రవృత్తికి ఉపయోగించినంతకాలం మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అయితేగాని ఆత్మసుఖం అందదు. మీ శరీరం చనిపోయేలోపులో ఆత్మసుఖాన్ని కొన్ని క్షణాలు ఎంజాయ్ చెయ్యండి. మీరు కనుక ఆత్మసుఖాన్ని ఎంజాయ్ చేస్తే ఈ ప్రపంచం అంతా మీకు ఒక గడ్డిపరకకింద కనిపిస్తుంది. లోపలఉన్న అంతర్యామిని ఉన్నది ఉన్నట్లుగా ఎవడైతే దర్శించాడో ఇంక వాడికి ప్రపంచంలో ఉన్న విషయాలమీద ఏమీ ఆకర్షణ కలుగదు. ఏ వస్తువును తెలుసుకోవటం వలన జన్మరాహిత్యం వస్తుందో, దేనిని తెలుసుకోవటంవలన ముగింపులేని శాంతి, ఆనందం కలుగుతుందో దానిని తెలుసుకోవటంకోసం పూర్వం అనేకమంది మహారాజులు వారి రాజ్యాలను త్యాగంచేసి, తపస్సులు చేసారు. ఈమధ్య ఆస్ట్రేలియాలో ఒక క్రికెట్‌వీరుడు బంతి తగిలి చనిపోయాడు. అప్పుడు అక్కడ ఉన్న పెద్దలను మాట్లాడమంటే అందులో ఒకడు మాట్లాడుతూ బ్రదర్, మైడియర్ బ్రదర్ ఫేర్‌వెల్ టు యు అని చెపుతూ ఈ శరీరం చనిపోయింది, నువ్వు కనుక ఈ శరీరమే అయితే, ఇంకో శరీరం ధరించి వచ్చి మాతో కలిసి ఉండు. నువ్వు ఈ శరీరం కాకపోతే, నువ్వే కనుక ఆత్మ అయితే, మేము కూడా ఆత్మే కాబట్టి నువ్వు మాతోనే ఉన్నావు. మేము నువ్వు ఒకటిగానే ఉన్నాము. ఊరికే నీ శరీరం డిజప్పియర్ అవుతోంది కాని నువ్వు మాతోటి కలిసే ఉన్నావు, నువ్వు మేము వేరు పడలేదు అని చెప్పాడు.

శాస్త్రంమీద, భగవంతుడిమీద మీకు విశ్వాసం ఉండాలి. విశ్వాసం కుదిరితే మాట దేవుడై ఉన్నది. మాటలు అంటే దేవతలు. మీరు సత్సంగాలలో అక్షరాలు చదువుతూ ఉంటే అవి అక్షరాలు కాదు అవి దేవతలే. అవి దేవతలే అని తెలుసుకోకుండా, ఆ మాటలకు ఉన్న విలువ తెలుసుకోకుండా మీరు చదవటం ఆ గ్రంథానికి, రచయితకు అన్యాయం చేసినట్లు. అలాగే భగవద్గీత చదివేటప్పుడు దానిమీద గౌరవం ఉండాలి, అది సాక్షాత్తు భగవంతుడు చెప్పిన ప్రవచనం, భగవద్గీత ఉపదేశ గ్రంథం. ఈమధ్య ఒక భక్తుడు పూరీజగన్నాథంలోఉన్న కృష్ణస్వామిని తీసుకొనివచ్చి నా చేతిలో పెట్టారు. నేను ఆ స్వామి వంక చూస్తున్నాను. అలా చూస్తూ ఉంటే ఆ శరీరం అదృశ్యం అయిపోయింది, రూపం అదృశ్యం అయిపోయింది, మొత్తం అంతా అదృశ్యం అయిపోయింది. కృష్ణుడు అంటే నువ్వు చూసే శరీరంకాదు, అంతటా వ్యాపించిన సద్వస్తువే కృష్ణుడు. ఆ సద్వస్తువే ఊరికే రూపం ధరించింది, నేను కృష్ణుడిని అలా చూస్తు ఉంటే కృష్ణుడి రూపం దర్శనం ఇవ్వకుండా, కృష్ణుడి యొక్క గుణాలు దర్శనం ఇవ్వకుండా, కృష్ణుడి యొక్క వ్యక్తిగత వైభవం దర్శనం ఇవ్వకుండా ఏ వస్తువు

అయితే కృష్ణుడి రూపం ధరించిందో ఆ వస్తువు కృష్ణుడి యొక్క శరీరం ద్వారా దర్శనం ఇచ్చింది. ఇది నా అనుభవం. అప్పుడు నాకు కృష్ణుడు అంటే కేవలం వసుదేవుడిగారి అబ్బాయికాదు, విశ్వరూపంలో చూపించిన కృష్ణుడే నిజమైన కృష్ణుడు అని అనిపించింది. మనం ఈ దేహమే సత్యం అనుకొంటున్నాము. మనకు నూటికి నూరుపాళ్ళు దేహపోషణ బుద్ధి తప్పించి ఇంక మనకు ఆత్మబుద్ధి లేదు. మనకు 24 గంటలు దేహచింతన తప్పించి కనీసం కొన్ని నిమిషాలు అయినా ఆత్మచింతనలేదు. ఆ చేసే వాళ్ళుకూడా ఏదో సాంప్రదాయంగా చేస్తున్నారుకాని ఈశ్వరుడి యొక్క విలువ తెలిసి చేస్తున్నారు అని చెప్పటానికి వీలులేదు. అందుచేత మీరు భగవద్గీతను శ్రద్ధగా పారాయణ చేయండి. భగవద్గీత ఉపదేశ గ్రంథం. భగవద్గీతను అధ్యయనం చేయటంద్వారా, భగవద్గీతను అర్థం చేసుకోవటం ద్వారా మీకు సర్వసందేహాలు పోతాయి, మీరు సంశయరహితులు అవుతారు, మీరు తరిస్తారు. అరుణాచలంవెళ్ళిన కొత్తలో భగవాన్ కూడా గిరిప్రదక్షిణ చేసేవారు. గిరిప్రదక్షిణ చేసేవారు ఏవో కబుర్లు చెప్పకొంటూ స్పీడుగా వెళ్ళిపోతున్నారు. అలా కాదు. గిరిప్రదక్షిణ చేసేటప్పడు మౌనంగా ఉండి, నవమాసాలు నిండిన గర్భిణీ స్త్రీ ఎలా నడుస్తుందో అంతనెమ్మదిగా గిరి ప్రదక్షిణ చేయాలి. మీరు ప్రక్కవారితో మాట్లాడకూడదు. ఆ కొండను ధ్యానం చేస్తూ గిరిప్రదక్షిణ చేస్తే మీరు అరుణచలేశ్వరుని దయకు పాత్రులవుతారు.

భగవాన్ ఏమని చెప్పారు అంటే మీరు గిరిప్రదక్షిణ చేసేటప్పడు మీకు ఏదైనా కోరిక ఉంటే అది నెరవేరుతుంది. అయితే మీరు ఒక విషయం అర్థం చేసుకోవాలి. ఇక్కడ మనకు కోరికలు నెరవేరటం ముఖ్యంకాదు. జ్ఞానం ప్రధానం. ఒక కోరిక నెరవేరింది అంటే ఆ నెరవేరిన కోరిక ఇంకో వంద కోరికలు తీసుకొనివస్తుంది. అందులో ఈ ప్రమాదం ఉంది. అది కోరిక యొక్క స్వభావం. కోరికలు అనే గొయ్యిని ఎవడూ పూడ్చలేడు. అందుచేత మీరు ఏ కోరిక లేకుండా భగవంతుడి అనుగ్రహం కోసమే గిరిప్రదక్షిణ చేస్తే మీకు ఈశ్వరానుగ్రహం కలుగుతుంది, మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. భగవాన్ అక్షరమణమాలను ఎక్కడో ఒకచోట కూర్చుని వ్రాయలేదు. గిరిప్రదక్షిణ చేసేటప్పడు ఆయనకు సహజంగా ఏదైతే స్ఫురించిందో దానిని 108 ద్విపదలకింద వ్రాసారు. ఈరోజున జ్యోతిప్రజ్వలన చేసిన తరువాత చాలామంది అక్షరమణమాలను పారాయణం చేస్తారు. భగవాన్ భక్తులు ఆ రోజులలో అక్షరమణమాలను పాడుకొంటూ బిక్షకు వెళ్ళేవారు. అక్షరమణమాల పాడే వాళ్ళందరూ భగవాన్ భక్తులు అని గుర్తించి వారికి ఎంతోకొంత అన్నం, కూరలు పెట్టేవారు. అందుచేత ఈ అక్షరమణమాల మనకు చాలాకాలం కూడు పెట్టింది అని భగవాన్ నవ్వుతూ అనేవారు.

మనం వ్యక్తిభావనతో మాట్లాడకూడదు. అక్కడ అవసరం ఉంటే మాట్లాడాలి, అవసరంలేని మాటలు పనికిరాదు. గౌతమబుద్ధుడితో ఎవరైనా మాట్లాడుతూ ఉంటే నువ్వు మాట్లాడేమాటలు నాకు ఏమైనా ఉపయోగపడతాయా అని అడిగేవాడు. మీకు ఏమీ ఉపయోగపడవు అంటే అయితే ఆ మాటలు నాకు ఎందుకు చెపుతున్నావు. ఉపయోగ పడని మాటలు ఎందుకు? బయటకు వెళ్లిపో అనేవాడు. మనం ఏదైనా మాట్లాడితే ఆ మాటకు అర్థం ఉండాలి. అవసరాన్ని బట్టి మాట్లాడాలికాని అహంభావనకోసం మాట్లాడకూడదు. ఏ మనిషి అయితే అహంభావనకోసం పనిచేస్తున్నాడో, అహంభావన కోసం మాట్లాడుతున్నాడో, అహంభావనను కేంద్రంగా పెట్టుకొని ఆలోచిస్తున్నాడో వాడు ఎప్పుడూ భగవంతుడిలో ఐక్యం కాలేడు, వాడికి జన్మరాహిత్యం రానేరాదు.

అరుణాచలేశ్వరుడికి, రమణస్వామికి గత జన్మల సంబంధం ఉంది. మీకు, మాకు కూడా అంతే. గత జన్మలలో సంబంధం ఉంటే ఆ సంబంధం ఈ దేహం చనిపోయేవరకు అలా కంటిన్యూ అవుతుంది. ఆ అనుబంధం కనుక లేకపోతే ఎక్కడో ఒకచోట బ్రేక్ అయిపోతుంది. మహాత్ముల దర్శనం మంచిది, వారి ప్రెజన్స్ కూడా మంచిది. మీ అందరి హృదయాలలో నేను అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. అందుచేత హృదయంలో అన్వేషిస్తే భగవంతుడు మనకు తెలియబడతాడు. పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొంటూ, భగవంతుడి కోసం శాస్త్రాలలో వెతుకుతూ ఇలా రాంగ్‌డైరెక్షన్‌లో వెళుతున్న ప్రపంచాన్ని రైట్‌డైరెక్షన్‌లోనికి తిప్పటానికి వచ్చిన అవతారమే రమణావతారం. శాస్త్ర పాండిత్యమే ఆత్మజ్ఞానం అనుకొనే టైములో శాస్త్రపాండిత్యం జ్ఞానంకాదు, జ్ఞానం నీ హృదయంలో ఉంది. పాండిత్యానికి జ్ఞానానికి ఏమీ సంబంధంలేదు, జ్ఞానంకోసం నువ్వు పుస్తకాలలో వెదకటంకాదు, హృదయంలో వెదుకు అది నీకు తెలియబడుతుంది. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెదికితే అది నీకు తెలియబడుతుంది కాని వస్తువు లేనిచోట వెదికితే అలా కొన్ని వేల జన్మలు వెదికినా అది నీకు దొరకదు అందుచేత హృదయంలో వెదుకు, అది నీకు దొరుకుతుంది అని తెలియజేసినవాడే భగవాన్ రమణమహర్షి.

మీకు మంచి ఆలోచనలు వస్తూ ఉంటే, మంచి సంకల్పాలు వస్తూ ఉంటే మంచి కర్మలు చేస్తారు. మంచి కర్మలు చేస్తే మంచి జన్మలు వస్తాయి. అలాగే మీకు చెడ్డ సంకల్పాలు వస్తూ ఉంటే చెడు కర్మలు చేస్తారు దానివలన చెడ్డజన్మలు వస్తాయి. అంటే నువ్వు మంచి కర్మ చేసినా, చెడ్డ కర్మ చేసినా అది నిన్ను వెంటాడుతుంది. ఆ కర్మ యొక్క ఫలితం ఏదో జన్మలో నువ్వు అనుభవించేవరకు అది నిన్ను విడిచిపెట్టదు. ఇది కర్మసిద్ధాంతం. అందుచేత

చేసే కర్మలను బట్టి జన్మలు వస్తాయి. మరల ఆ జన్మలో చేసిన కర్మను బట్టి రాబోయే జన్మలు ఉంటాయి. అందుచేత లెట్ నోబుల్ థాట్స్ కమ్ టు అజ్ ఫ్రమ్ ఎవ్విరిసైడ్ అని ఋగ్వేదంలో ఉంది. ఎటుచూసినా, నేను ఎక్కడ ఉన్నా నాకు పవిత్రమైన తలంపులు, బాగుపడే తలంపులు నా మెదడులోనికి వచ్చుగాక, మంచి సంకల్పాలతోటి, మంచి భావాలతోటి, మంచి ఆలోచనలతోటి నా హృదయం నిండుగాక. మనకు తలంపు వచ్చాక ఆ తలంపును బట్టి పని చేస్తాము. అందుచేత మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి, ఎటువంటి ఆలోచనలు వస్తున్నాయి అని జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం బాగుపడే స్నేహాలే చేయాలి.

మనం నేను నేను అంటాము. అది ఒక తలంపు మాత్రమే. ఈ నేను అనే ఒంటి స్థంబం మీదే సృష్టి అంతా ఆధారపడి ఉంది. ఈ నేను అనే తలంపు అణిగిపోతే వాడికి ప్రపంచం అణిగిపోతుంది. దేహం అణిగిపోతుంది, దేవతలు అణిగిపోతారు. దేహం లేని వాడికి ప్రపంచం ఏముంటుంది? నీకు దేహం ఉంటే ప్రపంచం కాని దేహం లేనివాడికి ప్రపంచం ఏముంది? ప్రపంచం లేనివాడికి దేవుడు ఏమిటి? అందుచేత నేను అణిగిపోతే నువ్వు అణిగిపోతావు, నువ్వు అణిగిపోతే వాడు అణిగిపోతాడు. అందుచేత ఈ నేను అనే తలంపు నుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యాలి. దేహం చనిపోయేటప్పుడు దుఃఖం వస్తుంది ఎందుచేతనంటే వాడు దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాడు కాబట్టి. ఆ దేహమే నేను అని వాడు అనుకొంటున్నాడు కాబట్టి దేహం పోయినప్పుడు నేను కూడా పోతున్నాను అని వాడు దుఃఖపడతాడు. ఇప్పుడు మనం చెప్పకొనే నేను దేహగతమైనది, మనోగతమైనది. దీనితో ఏమీ సంబంధం లేకుండా నిజమైన నేను ఒకటి ఉంది అది ట్రూ ఐ. కృష్ణుడు నేను, నేను అని చెప్పినప్పుడు అది ట్రూ ఐ. నన్ను అర్థం చేసుకోండి అంటే అక్కడ ఆ శరీరం అనికాదు, ట్రూ ఐ దగ్గరకు ఎదిగి రండి అని చెప్పటం.

మనం కాలాన్ని జయించాలి, అదర్‌నెస్‌ను జయించాలి. మంచి పనులు చేసేవారు కూడా మనలను వారు గుర్తిస్తున్నారా, వీరు గుర్తిస్తున్నారా అనుకొంటారు. ఫలానావారు మంచిపని చేసారు అని ఒకవేళ ప్రజలు మిమ్మల్ని గుర్తించినా మీరు ఆధ్యాత్మికంగా లోపల కుళ్ళిపోతారు. మీరు పైకి నున్నగా కనిపిస్తారు లోపల శుభ్రంగా కుళ్ళిపోతారు. అందుచేత అదర్‌నెస్ ఉండకూడదు. మీ పని ఏదో మీరు శ్రద్ధగా చేసుకోండి. అందరూ గుర్తించారా లేదా అంటే అప్పడు మీకు వ్యక్తిభావన పెరిగిపోతుంది. మీరు చేసే పనిని సమాజం గుర్తించటం వలన మీకు ఏమీ ప్రయోజనం లేదు. మీరు చేసే పనిని భగవంతుడు గుర్తించాలి.

భగవంతుడికి ప్రీతి కలిగించే పనులు మీరు చేస్తే ఆయన అనుగ్రహం మీకు కలుగుతుంది, మీరు తరిస్తారు. మీకు సుఖం లేనప్పుడు, మీకు శాంతి లేనప్పుడు మీరు బాగానే ఉన్నారు అని ప్రజలు అనుకోవటం వలన మీకు లాభం ఏమిటి? పది లక్షలు మీకు అప్పు ఉంటే, మీరు పదికోట్ల నిల్వలో ఉన్నారని ప్రజలు చెప్పుకొంటే మీకు లాభం ఏముంది? అందుచేత మీరు మీరుగా ఉండండి. అదర్‌నెస్ వద్దు. అదర్‌నెస్ ఉన్నవాడికి జ్ఞానం కలుగదు. నువ్వు కాలాన్ని జయించాలి. మనం రాత్రి 8 గంటలు నిద్రపోతే మీకు 8 క్షణాల కింద వెళ్ళిపోతుంది. అలాగే పగలు టైము కూడా మీకు ఒక క్షణం కింద వెళ్ళిపోవాలి. మీరు కాలాన్ని జయించాలి, ద్వితీయాన్ని జయించాలి. సత్సంగంవల్ల మీకు ప్రాపంచిక విషయాలతో సంబంధం తెగిపోతుంది. సత్పురుషుల సహవాసం మీకు దొరకాలి అంటే మీకు పూర్వపుణ్యం ఉంటే అది మీకు లభ్యం అవ్వాలి కాని లేకపోతే మీకు లభ్యంకాదు. ఒకవేళ మీకు తెలివితేటలు ఉంటే అది భగవంతుడు ఇచ్చినదే, మీకు ఐశ్వర్యం ఉంటే అది భగవంతుడు ఇచ్చినదే, మీకు ఏది వచ్చినా అది భగవంతుడు ఇచ్చిందేకాని అది మీ సొంతంకాదు. ఇది భగవంతుడు ఇచ్చిందే, ఇది ఆయన ప్రసాదమే అనే తలంపు మీరు ఎప్పుడూ విడిచిపెట్టకండి. మీలో ఏదైనా ప్రత్యేకత ఉంటే, ఒకవేళ మీరు మేధావులు అయితే అది కూడా మీకు భగవంతుడు ఇచ్చిందేకాని మీ సొంతం కాదు. ఏదైనా మనం అనుకొంటే రాదు, ఆయనే ఇవ్వాలి. ఏ మనిషిలో ఏ ప్రత్యేకత కనిపించినా దానిని చూసి మీరు అసూయపడవద్దు. అది భగవంతుడు ఇచ్చిన ప్రసాదంగా గుర్తించండి.

దేహపరంగా, మానసికపరంగా బయటనుండి వచ్చే సుఖాలను మీరు ఎప్పుడు నమ్మవద్దు. వంతెనకింద నీరు ఎలా ప్రవహిస్తుందో అంటే వంతెన కిందకు నీరు వస్తుంది, వెళ్ళిపోతుంది అలాగే బాహ్యసుఖాలు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి, అవి నిలబడవు. ఫండమెంటల్‌గా భగవాన్ చెప్పింది ఏమిటి అంటే సుఖం అనేది, శాంతి అనేది ప్రపంచంలో ఏ వస్తువులోను లేదు అన్న సంగతి మీకు అనుభవంలోనికి రావాలి. అక్కడ ఏదో ఉంది, ఏదో ఉంది అంటే వెదకాలి అనిపిస్తుంది. ప్రపంచంలో ఏ వస్తువులోకాని, ఏ వ్యక్తిలోకాని ఎక్కడా సుఖం అనేది లేదు అని ముందు మీకు తెలియాలి. సుఖం అనేది, శాంతి అనేది మీ హృదయంలోనే ఉంది. అది ఇండిపెండెంట్. బయటనుండి వచ్చే సుఖాలు అన్నీ టెంపరరీ. అలా వస్తూ ఉంటాయి, పోతాయి. హృదయంలో ఉన్న సుఖం స్వంతంత్రమైనది. స్వతంత్రమైన సుఖం ముగింపులేకుండా ఉంటుంది, నీ శరీరం మరణించినా ఆ సుఖం మాత్రం అలా కంటిన్యూ అయిపోతుంది కాని దానికి ముగింపు లేదు. ఇప్పుడు మీకు ఒక శరీరం ఉంది.

అది ఏదోరోజు మరణిస్తుంది, అది ఖాయం. అయితే మరణంలేని వస్తువు ఒకటి మీ హృదయంలో ఉంది. ఈ దేహం మరణించకముందే నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొంటే ఒకవేళ నీ దేహం మరణించినా ఆ వస్తువుకు మరణం లేదు కాబట్టి ఈ దేహం చనిపోయినా నేను ఉంటాను అనే అనుభవం మీకు కలుగుతుంది. దేహం మరణించిన తరువాత కూడా మనం ఉంటాము కాని ఉండము అని అనుకోవటంవలన మనకు భయం వేస్తోంది. మహాత్ములు, మహర్షులు చేసే పని ఏమిటి అంటే మనల్ని దుఃఖంలేనిస్థితికి తీసుకొనివెళ్ళటానికే వారు పనిచేస్తున్నారు. అయితే వారు చేసే పని మీ కళ్ళకు కనబడదు, మీ చెవులకు వినబడదు. మీ శరీరం చనిపోకముందే శరీరం మరణించిన తరువాత కూడా మనం ఉంటాము అనేటువంటి స్థితిని మీరు ఎక్స్‌పీరియన్స్ చెయ్యాలి, మీ జీవితం యొక్క గమ్యం అదే. శరీరమే కనుక మనం అయితే శరీరం పోయినప్పుడు మనం కూడా పోతాము, శరీరం మనం కానప్పుడు శరీరం పోయినప్పుడు మనం పోము, మనం ఉంటాము ఆ స్థితిని ఇప్పుడు మీరు జీవించి ఉండగానే అనుభవంలోనికి తెచ్చుకోవాలి.

భగవాన్ మరణానుభవం ద్వారా మరణంలేనిస్థితిని పొందారు. ఆయన మామూలుగా గదిలో కూర్చుని ఉండగా మరణం వచ్చి ఆయనమీద పడింది, శ్వాస ఆగిపోయింది, శరీరం శవం కింద అయిపోయింది. చనిపోయిన శరీరాన్ని సాక్షిగా చూస్తున్నాడు. ఈ శవాన్ని స్మశానంలో కాల్చేస్తారు అయినా నేను ఉంటున్నాను. చనిపోయే ఈ శరీరానికి నాకు ఏమీ సంబంధం లేదు, శరీరం చనిపోయినా నేను ఉన్నాను అనే అనుభవం ఆయనకు మరణానుభవం ద్వారా కలిగింది. ఇవి వట్టి మాటలు కాదు. ఆయన ప్రాక్టికల్‌గా మరణాన్ని అనుభవించి దానిద్వారా మరణంలేనిస్థితిని పొందారు. శరీరానికి మరణం రావటం, ఆ మరణానుభవం ద్వారా మరణంలేనిస్థితిని పొందటం ఇదంతా కొన్ని క్షణాలలో జరిగిపోయింది. అది దేవతానుగ్రహం. ఒక దేవతాస్వరూపుడి అనుగ్రహం ఉంటే మనం కూడా మరణంలేనిస్థితిని పొందవచ్చు.

**తిండిని నిన్ను చేరితిని తిననా నేను**
**శాంతమై పోవుదును అరుణాచలా**

నీకు ఆహారమైన నేను, నీ దగ్గరకు వచ్చాను. ఆ నేనును నువ్వు తినేయాలి. ఏదైతే నేను నేను అంటున్నానో ఆ నేనును నువ్వు ఆహారంగా తీసుకో. అప్పుడు నీకు ఆకలి తీరుతుంది. ఆ నేనును నువ్వు తినేస్తే దాని పీడ నాకు వదిలిపోతుంది. అంటే నేను అనే తలంపు నుండి

విడుదల పొందుతాను. మనకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. అంటే వ్యక్తిభావనే నేనుగా వ్యక్తమవుతోంది. దీనిలో నుండి ఎవడైతే విడుదల పొందాడో వాడికి శాశ్వతమైన సుఖం, శాశ్వతమైన శాంతిని ప్రసాదంగా ఈశ్వరుడు అందజేస్తాడు. అదీ ప్రసాదం. మీరు భగవంతుడికి దూరంగా ఉంటున్నారు, మీ స్వరూపానికి దూరంగా ఉంటున్నారు, ఆత్మజ్ఞానానికి దూరంగా ఉంటున్నారు. ఏ వస్తువు అయితే మీరు అయి ఉన్నారో దానికి దూరంగా ఉంటున్నారు. అలా కాదు. ఏ వస్తువు అయితే మీరు అయి ఉన్నారో దానితో అనుబంధం పెట్టుకోండి. దానితోటి ఏకం కండి. మీరుకాని విషయాలను ఎక్కువగా చింతిస్తూ వాటితో అనుబంధం పెట్టుకోవద్దు. మీరుకాని విషయాలతో అనుబంధం పెట్టుకొంటే మీరు కాని ఈ దేహానికి ఈ ప్రపంచానికి దగ్గరైపోతారు, మీ స్వరూపానికి దూరమైపోతారు. అంటే అసత్యానికి దగ్గరవుతారు, సత్యానికి దూరమైపోతారు.

మీకు లోకవాసన ఎక్కువగా ఉంది. లోకంలోని గొడవలు చెప్పకొంటూ ఉంటే శ్రద్ధగా వింటున్నారు. సినిమాలు, టీవీలు శ్రద్ధగా చూస్తున్నారు. భగవద్గీతలో ఒక రహస్యం చెప్పాడు, ఇది అద్భుతంగా ఉంటుంది. మీ హృదయంలో ఉన్న వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చాక ఇంతవరకు మీరు విన్న విషయాలమీద, మీరు చూసిన విషయాలమీద మీకు రోత పుడుతుంది అని చెప్పాడు. ఈ విషయాల మీద రోత పుట్టటానికి ఇంతకాలం వేస్టు చేసుకొన్నాము అని హృదయంలో ఉన్న వస్తువు మీకు వ్యక్తమయ్యాక తెలుస్తుంది, ఇప్పడు తెలియదు. ఇంతకాలం ఈ సబ్జక్టును తెలుసుకోకుండా జీవితాన్ని పాడుచేసుకొన్నాము అని అనుకోవద్దు. ఏవయస్సులో మీకు ఈ సబ్జక్టు మీద ఇంటరెస్ట్ కలిగిందో అప్పటి నుండి సాధన ప్రారంభించండి. ఇంక గతంలోనికి వెళ్లకండి. మీకు జరిగిపోయిన గొడవలు జ్ఞాపకం వస్తూ ఉంటే మీకు దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పడు ఇక్కడ కూర్చున్నారు, సబ్జక్టు వింటున్నారు. ఫర్‌గెట్ ద పాస్ట్. గతాన్ని మర్చిపోకపోతే చేతిలో ఉన్న వర్తమానకాలం జారిపోతుంది. వర్తమానకాలాన్ని ఎప్పడైతే ఉపయోగించుకోలేకపోతున్నారో ఇంక మీకు భవిష్యత్ లేదు. గతాన్ని తలపెట్టుకొంటూ ఉంటే దుఃఖానికి సంబంధించిన ఏదో తలంపు వచ్చేస్తుంది. మర్చిపోతే ఏమీలేదు.

మీరు ప్రాపంచిక విషయాలతో ఎక్కువగా సంబంధం పెట్టుకొంటున్నారు. మీ మనస్సులో ఉన్న వాసనలు ధ్వంసం అవ్వాలి, అది ముఖ్యం. ఏ కారణం వలన మనస్సు బయటకు వెళుతోందో జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. అలవాటును బట్టి మనస్సు బహిర్ముఖమవుతుంది. ఏ అలవాటు వలన మనస్సు బహిర్ముఖమవుతోందో చూసుకుని

అక్కడనుండి దానిని ఉపసంహరించాలి. దానిని ఉపసంహరించి, రిపీట్ చెయ్యకపోతే ఆ వాసన నెమ్మదిగా పల్చబడి నశిస్తుంది. వాసనాక్షయం అవ్వకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. ఈ అలవాట్లనుండి బయటకు రావటానికీ, వాసనాక్షయానికీ పూర్వం చాలామంది ఋషులు కష్టపడి తపస్సులు చేసారు. తపస్సు అంటే ఎండింపచేయటం, నీలో ఉన్న బలహీనతలను ఎండింపచేయటమే తపస్సు. ఈ శరీరానికి మరణం రాకముందే నీలో ఉన్న వాసనలను కాల్చిబూడిద చెయ్యాలి. అయితే దీనికి మానవ ప్రయత్నం ఒక్కటే సరిపోదు, గురువు అనుగ్రహం ఉండాలి. అలవాట్లలో నుండి మీరు బయటకు రావాలి అంటే మీ ప్రయత్నంతోపాటు ఈశ్వరానుగ్రహం ఉండాలి. ఈశ్వరానుగ్రహం లేకుండా ఒక చిన్న అలవాటులోనుండి కూడా మనిషి బయటకు రాలేడు. మీరు ప్రాపంచిక విషయాలతో ఎటాచ్‌మెంట్ తగ్గించుకోవాలి. ఆ ఎటాచ్‌మెంట్ మనకు దుఃఖాన్ని తీసుకొని వస్తోంది. ఎవడికైతే ప్రాపంచిక విషయాలతో మానసికమైన ఎటాచ్‌మెంట్ లేదో వాడు హృదయంలో ఉన్న వస్తువులో లయం అవుతాడు. అప్పుడు ఇంక పొందవలసింది అంటూ ఏమీ లేదు. అది ఎఛీవ్ చెయ్యాలి. అప్పుడు కర్మవాడిని విడిచిపెట్టేస్తుంది. అయితే అవతారపురుషులు ఎందుకు పనిచేసారు అంటే స్వార్థం కోసం కాదు, ప్రజా క్షేమం కోసం వారు పనిచేసారు. రాముడు, కృష్ణుడు ఉన్నారు, అయితే మనకి వారికి తేడా ఏమిటి? వారికి దేహం ఉంది, మనకూ దేహం ఉంది. అయితే మనం ఆ దేహంతో కలిసి ఉంటాము, ఆ దేహమే మనం అనుకొంటాము. దేహబుద్ధిని విడిచిపెట్టి ఒక్క క్షణం కూడా ఉండము. రాముడికి, కృష్ణుడికి దేహం ఉన్నప్పటికీ ఆ దేహంతో వారికి ఇసుమంతయు సంబంధం లేదు. భగవంతుడు ఒక దేహం ధరించి వచ్చినప్పటికీ వాడు ఆ దేహంకాదు, వాడు ఎవడిగా ఉన్నాడో వాడికి లోపల తెలుస్తూ ఉంటుంది, వాడికి దేహం ఉన్నా దేహబుద్ధి ఇసుమంతయు ఉండదు. ఇది గుర్తుపెట్టుకోండి. అందుచేత ఏదో కృష్ణుడికి శరీరం ఉంది, మనకీ శరీరం ఉంది అని అనుకోవద్దు. ఆయన ఎవడో నాకు చూపించాడు పూరీజగన్నాథస్వామి. నేను ఏదిగా ఉన్నానో అది నువ్వు చూడటంలేదు, నువ్వు చూసే ఈ శరీరం నేను కాదు అని ప్రత్యక్షంగా చూపించాడు పూరీస్వామి.

ఈ ప్రపంచం ఎటువంటిది అంటే కుక్కతోకలాంటిది. కుక్కతోక వంకర ఎవడూ తీయలేడు. అలాగే ఈ ప్రపంచాన్ని బాగుచేయాలని ఎవడైనా అనుకొన్నా ఇంతవరకు ఎవడూ బాగుచేయలేదు. అనేకమంది రిఫార్మర్స్ వచ్చారు. ఈ సమాజంలో ఉన్న రాగద్వేషాలు, కుట్ర ఏమైనా తగ్గిందా? అందుచేత నీవు సమాజాన్ని అనుసరించవద్దు. మన ప్రయత్నం

ఏదో మనం చేసుకొని ట్రూత్‌ను కనుక రీలైజ్ చేస్తే ఆ రీలైజేషన్ ఇతరులకు కూడా ఉపయోగపడుతుంది. నువ్వు ఏదైనా పనిచేసేటప్పుడు ఏ తలంపుతో ఆ పని చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు కాని నువ్వు చేసే పనిని ఆయన చూడడు. ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయనకు తెలియకుండా మనం ఏ పనీ చేయలేము. మనం చేసే ప్రతీ పని భగవంతుడు చూస్తున్నాడు, మనం మాట్లాడే ప్రతీమాట భగవంతుడు వింటున్నాడు అని మనం మర్చిపోకూడదు. ఓ రామా తనువు తాను కాదని తెలిసినవాడికి తపమేల, జపమేల, యజ్ఞమేల అన్నాడు త్యాగరాజు. భగవాన్ త్యాగరాజు గురించి ఏమన్నారు అంటే ఆయన పాటలు పాడి పొందలేదు, పొందవలసింది ముందు పొంది తరువాత పాటలు పాడారు అని చెప్పారు. ఎక్కడ చెయ్యి పెడితే అక్కడ నీరు దొరుకుతూ ఉంటే ఇంక వాడికి నూతుల దగ్గరకు, చెరువుల దగ్గరకు పరుగెత్తవలసిన పని ఏముంది? అలాగే తాను దేహమాత్రుడనుకాదు, ఈ పుట్టేవాడు చనిపోయేవాడు తాను కాదని ఎవడికైతే అనుభవం కలిగిందో ఇంక వాడికి తపస్సులతోటి, జపాలతోటి, యాగాలతోటి పని ఏముంది?

మీరు పొందవలసింది ఏదో ఇప్పడే, ఈ జన్మలోనే పొందటానికి ప్రయత్నం చేయండి. ఏమో రాబోయే జన్మలు ఎలా ఉంటాయో? అప్పడు పరిస్థితులు ఎలా ఉంటాయో? చెప్పలేము. ఇప్పడు కాలాన్ని, శక్తిని వృధా చేసుకోవద్దు. మోక్షస్థితిని ఎప్పడో పొందుదాము అనుకొంటే మీరు పొందలేరు. ఎప్పడోకాదు, ఎక్కడోకాదు ఇప్పడే ఇక్కడే ఆ వస్తువును తెలుసుకొనే ప్రయత్నం ప్రారంభించండి. సాధ్యమైనంతవరకు ఈ శరీరానికి మరణం రాకముందే దానిని పొందటానికి చూసుకోండి. ఎప్పడైతే మీకు పూర్తిగా వాసనాక్షయం అయిందో అప్పడు మీరు జీవన్ముక్తులు అవుతారు. ఏ గుణాలు అయితే మిమ్మల్ని పీడిస్తున్నాయో వాటిలోనుండి విడుదలచేసి నిర్గుణస్థితిని, నిరాకారస్థితిని మీచేత పొందింపచేయటమే భగవద్గీత యొక్క ప్రయోజనం. వాసనాక్షయం ముఖ్యం. మీ శరీరం చనిపోయే టైముకు చాలా వాసనలలోనుండి బయట పడ్డారు అనుకోండి, ఏదో ఒక్క వాసన మిగిలిపోయింది అనుకోండి, ఆ ఒక్క వాసనే మీకు మరల శరీరాన్ని తీసుకొని వస్తుంది అంటే అదే రీ బర్త్‌కు కారణం అవుతుంది. ఏమో మాయ ఎలా వస్తుందో చెప్పలేము. బస్తా రెండు రూపాయల రోజులలో పదికోట్లు దానం చేసినటువంటి పట్టనత్తార్ ప్రాణం పోయే టైములో నా బుద్ధి కుక్కమీద, చిప్పమీద నుండి పోవటంలేదు అన్నాడు. అంటే నేను చనిపోయిన తరువాత ఈ చిప్పను ఎవడు పట్టుకొనిపోతాడు, ఈ కుక్కకు అన్నం ఎవడు పెడతాడు అనే ఆలోచనలో ఉన్నాను. ఎందుకు తపస్సులు చేసినట్లు, ఎందుకు త్యాగాలు చేసినట్లు అన్నాడు. నాకు

ప్రాణం పోయే పరిస్థితి వచ్చింది కాని ఇప్పుడు నా బుద్ధి భగవంతుడిని పట్టుకోవటంలేదు. ఈ చిప్పను, కుక్కను పట్టుకొంటోంది అని చెప్పాడు. ఇదే మాయ. అందుచేత నా అనుగ్రహం లేకుండా, నా దయ లేకుండా ఈ మాయలో నుండి ఎవడూ బయట పడలేడు అని పరమాత్మ చెప్పాడు. మీకు సత్పురుషుల సహవాసం దొరికితే ఇతర నియమాలతో పెద్ద పనిలేదు. సత్పురుషులు ఎలా ఉంటారు అంటే వారే సరుకులు తెస్తారు, వారే వంట చేస్తారు, వారే అరిటాకు తెస్తారు, వారే వడ్డిస్తారు, మీరు తినటం అనే పని చేస్తే చాలు. హోలీ కంపెనీ అటువంటిది. పూర్వజన్మలో మీరు చేసిన పుణ్యాన్ని బట్టి మీకు సత్పురుషుల సహవాసం కనుక దొరికితే ఇంక మీరు చేసే పూజలు, జపాలు, స్నానాలు, యాత్రలు వీటితో పనిలేదు. నేచురల్‌గా ఎయిర్ వస్తూ ఉంటే ఇంక విసినకర్రతోటి పని ఏముంది? సీలింగ్ ఫేన్‌తో పని ఏముంది? సత్పురుషుల సహవాసం నేచురల్ ఎయిర్ వంటిది. గంగాజలం వలన పాపం పోతుందని, కల్పవృక్షం వలన దారిద్ర్యం పోతుందని, వెన్నెలవల్ల తాపం పోతుందని ఇవన్నీ శాస్త్రంలో చెపుతారు కాని సత్పురుషుల సహవాసం నీకు దొరికితే పైన చెప్పినవన్నీ సహజంగానే పోతాయి అంటే సత్పురుషుల వలన ఆ పనులు అన్నీ మీకు చేయబడతాయి. హోలీ కంపెనీ ప్రభావం అటువంటిది.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-03-2015, గొల్లలమామిడాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం భగవంతుడిని బాగా అలంకరించి, ఆయనను చూసి సంతోషిస్తాము. అంటే అలంకరించే వారము మనమే, చూసి సంతోషించేవారము మనమే. ఆయనకు ఇవి ఏమీ అవసరం లేదు. నాకు షిరిడీ చూడాలని కోరిక లేకపోయినా రెండుసార్లు షిరిడీ వెళ్లటం జరిగింది. దేహప్రారబ్ధంలో ఉంది కాబట్టి వెళ్ళాముకాని నా సంకల్పం ప్రకారం షిరిడీ వెళ్లలేదు. మనకు సంకల్పం లేకపోయినా మన తలంపుతో సంబంధం లేకుండా దేహప్రారబ్ధంలో ఉంటే అది జరిగిపోతుంది. నేను షిరిడీలో రాత్రి నిద్రపోయినప్పుడు ఆంజనేయస్వామి అంశగా షిరిడీ బాబాగారు నాకు దర్శనం ఇచ్చారు. హనుమంతుడు బహుసుందరుడు. ఎంత సౌందర్యం అంటే కవులు కూడా ఆ సౌందర్యాన్ని వర్ణించలేరు. అందుచేతనేమో హనుమంతుడు పాత్ర ఎక్కువగా ఉన్న కాండకు సుందరకాండ అని వాల్మీకి నామకరణం చేసాడు. కోరికలు నెరవేరాలి అనుకొనేవారు సుందరకాండను ఎక్కువగా పారాయణ చేస్తారు. మీకు జీవితంలో వచ్చే కష్టాలనుండి, బాధలనుండి రక్షించేది రామాయణం అని పెద్దలు చెపుతారు. మీకు ఐశ్వర్యం కావాలంటే రామాయణం పారాయణ చెయ్యండి, జయం

కావాలి అంటే మహాభారతం పారాయణ చెయ్యండి, వైరాగ్యం కావాలి జ్ఞానం కావాలి అంటే భాగవతం పారాయణ చెయ్యండి అని మన పూర్వీకుల ఉవాచ. మన భారతదేశంలో ఎక్కువ మంది రామనామం చేస్తారు. మనస్సులో ఎక్కువగా రామనామం చేస్తూ ఉంటే యోగాభ్యాసాలు అక్కరలేకుండా ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి. రామనామ స్మరణ చేసి అనేకమంది సిద్ధిని పొందారు.

ధర్మాన్ని ఆచరించు. పని విషయంలో అశ్రద్ధ పనికిరాదు. మీరు ఏ పని చేసినా శ్రద్ధగా చెయ్యండి. శరీరాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మరణాన్ని మీరు తప్పించుకోలేరు. కాని తప్పించుకొనే అవకాశాలు వస్తున్నాయి. శరీరం మరణిస్తుంది. శరీరం యొక్క మరణంతోటి, పుట్టుకతోటి సంబంధం లేకుండా మరణంలేని జీవితం ఒకటి మీ హృదయంలో కొనసాగుతోంది. ఈ శరీరం చనిపోయి మీకు ఇంకో శరీరం వచ్చినా ఆ జీవితం అలా కంటిన్యూ అవుతుంది. ఎవరైనా మహాత్ముల అనుగ్రహం వలన కాని, గురువు అనుగ్రహంవలన కాని మరణించే శరీరం వెనుక ఉన్న మరణంలేని జీవితాన్ని ఈ శరీరంలో ఉండగానే ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు తిరిగి ఈ సృష్టిలోనికి రానక్కరలేదు, ఇంక శవాలను మోయనక్కరలేదు, కల్మషాలతో కూడిన రాగద్వేషాలతో కూడిన ఈ జీవితాలలోనికి మరల రానక్కరలేదు. జీవితం అలా కంటిన్యూ అయిపోతుంది. శాంతి, సుఖం అలా కంటిన్యూ అయిపోతాయి. అయితే ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే ప్రభువు, ఆయనే ఈ సృష్టిని నడిపిస్తున్నాడు అనే విశ్వాసం సజీవంగా ఉండాలి.

మన జీవిత విధానం ఎలా ఉండాలి, గర్వరహితంగా ఎలా జీవించాలి, అవమానాలు వస్తే ఎలా భరించాలి, అన్నీ ఉన్నా ఎలా అణిగి ఉండాలి ఇటువంటి విషయాలు రామాయణంలో వాల్మీకి చెప్పాడు. కొంతమంది ఎదుటివాళ్ళు మాట్లాడితేకాని వీరు మాట్లాడరు. రాముడు అయితే ముందుగానే మిమ్మల్ని పలకరిస్తాడు, మీరు ఎదురువస్తే ముందుగా మీకు దారి ఇస్తాడు. రాముడిని మర్యాదపురుషోత్తముడు అంటారు. మీరు రాముడిని ఆదర్శంగా పెట్టుకొని, ఆయనను గమ్యంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే మీరు చైతన్యస్రవంతిలో ఐక్యమవుతారు. అంతా రామమయం అంతా చైతన్యమయం. ఉన్నది చైతన్యమే అయితే మరి స్త్రీలు ఎక్కడనుండి వచ్చారు, పురుషులు ఎక్కడనుండి వచ్చారు అంటే ఆ చైతన్యాన్ని మనస్సు స్త్రీకింద, పురుషులకింద విడగొట్టి ఒకరిమీద ఒకరికి ఆకర్షణ కలుగజేస్తోంది. ఈ రకమైన వ్యామోహంతో సృష్టి అంతా నడుస్తోంది. రాముడిని ఆదర్శంగా తీసుకొని జీవిస్తే ఈ సృష్టిలో నుండి, ప్రకృతిలోనుండి విడుదల పొందుతారు. ధర్మమే, జ్ఞానమే రాముడి

రూపంలో వచ్చి ఈ భూమి మీద తిరుగుతోంది అని వాల్మీకి చెప్పాడు. రామా నువ్వు పురుషుడి రూపంలో ఉన్న స్త్రీవి అని ఒకసందర్భంలో సీతమ్మ అంది. అప్పుడు కూడా ఆయన మొఖంలోకాని, కళ్ళలోకాని ఎక్కడా వికారం కనబడలేదు, ఆ మాట విని కూడా ఆయన ప్రశాంతంగా ఉన్నాడు, వాడు రాముడు. మీ భర్త ఎవరైనా మిమ్మల్ని ఈ రోజు కాఫీ బాగాలేదు అంటే ఆ చిన్నమాటకు మీ మొఖం ఎర్రబడిపోతుంది, మనస్సులో రజోగుణం వచ్చేసుంది. రాముడి రూపాన్ని ధ్యానిస్తూ, రామనామం స్మరించుకొంటూ మనం జీవిస్తూ ఉంటే మన మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది, మనస్సు పవిత్రమవుతుంది, అది చైతన్యంలో ఐక్యమవుతుంది.

వాల్మీకి ఏమన్నాడు అంటే రాముడిని మీరు చూడటంకాదు, రాముడిచేత మీరు చూడబడాలి అని చెప్పాడు. రాముడిని మీరు చూస్తే సరిపోదు, ఆయనచేత మీరు చూడబడాలి. రాముడు త్యాగానికి ప్రతిరూపం, సహనానికి ప్రతిరూపం. పెళ్ళి అంటే సీతారాముల కళ్యాణమే కళ్యాణం. ఒకరిపట్ల ఒకరికి అంకితభావం, కష్టసుఖాలను సమానంగా అనుభవించటం ఇవి అన్నీ వారిలో కనబడతాయి. అరణ్యంలో క్రూరజంతువులు ఉంటాయి, అరణ్యవాసం నీకు పనికిరాదు అని రాముడు సీతమ్మతో చెప్పినప్పుడు సీతమ్మ అంటుంది మీరు చెప్పినవి అన్నీ నిజమే కాని మీరు నా సమీపంలో ఉన్నప్పుడు అరణ్యవాసంలో ఉన్నా, అయోధ్యలో ఉన్నట్లే ఉంటుంది అంది సీతమ్మ. సీతారాముల కళ్యాణం అంటే సీతారాములు ఎలా జీవించారో అలా మనం కూడా జీవిస్తే జీవుడు వెళ్ళి పరమాత్మలో ఐక్యమవుతాడు, అంటే రెండుగా ఉన్నది ఒకటి అవ్వటం, అదే సీతారాముల పెళ్ళి. జనకమహారాజు నీకు అమ్మాయిని ఇవ్వటానికి అంగీకరిస్తున్నాడు, సీతమ్మకు ఇష్టమైంది ఇంక సీతమ్మను వివాహం చేసుకోవటానికి నీకు అడ్డేలేదు అని విశ్వామిత్రుడు రాముడితో చెపుతాడు. సరే అన్నీ బాగానే ఉన్నాయి మరి మా తండ్రిగారి అనుమతి కూడా తీసుకోవాలి కదా అంటాడు రాముడు. అదీ సాంప్రదాయం. ఈ సాంప్రదాయాలు ఎందుకు పెట్టారు అంటే నైతిక విలువలలోనుండి మనం జారిపోకుండా ఉండటం కోసం ఇవి అన్నీ ఏర్పాటు చేసారు. రేపు సింహాసనం మీద కూర్చోవటానికి సిద్ధంగా ఉండు అని చెప్పిన్నపుడు ఎలా ఉన్నాడో, 14 సంవత్సరాలు అరణ్యవాసం చెయ్యాలి అని చెప్పినప్పుడు కూడా అలాగే ఉన్నాడు. ఎక్కడా వికారంలేదు. అంటే అనుకూల పరిస్థితులలో ఎలా ఉన్నాడో, ప్రతికూలపరిస్థితులు వచ్చినప్పుడు కూడా అలాగే ఉన్నాడు. అది రాముడినిచూసి మనం నేర్చుకోవాలి. మనం అనుకూలపరిస్థితులలో బాగానే ఉంటాము, ప్రతికూలపరిస్థితులు వచ్చినప్పుడు మనం వాటిని తట్టుకోలేము. మనకు మానసిక

బలం లేదు. పెడితే తినటం నేర్చుకొన్నాము కాని తిడితేమటుకు మనం పడలేము.

ఎవరైనా మాటసాయం చేస్తారు, అన్నం పెట్టమంటే పెడతారు, ఇలా బాహ్యమైన విషయాలు త్యాగం చేస్తారు. కాని నువ్వు నాకోసం ప్రాణాన్నే త్యాగం చేసావు జటాయువు నువ్వు నాకు రెండో తండ్రివి అంటాడు రాముడు. మా తండ్రిగారికి నేను కర్మకాండ చేయలేదు కాని జటాయువు శవానికి స్వయంగా నిప్పపెట్టి మహాత్ములు, మహర్షులు, జీవితం పొడుగునా తపస్సులు చేసిన వారు ఎటువంటి ఉత్తమలోకాలకు వెళుతున్నారో జటాయువు నువ్వు కుడా ఆ ఉత్తమలోకాలకు వెళ్ళు ఇది రాముడు యొక్క ఆజ్ఞ అని చెప్పాడు. అంటే ప్రాణం ఇవ్వటం చాలా కష్టం. గాంధీగారు నిరంతరం రామనామం చేసేవారు. ఆయన శరీరాన్ని కాల్చినప్పడు కూడా హేరామ్ హేరామ్ అంటూ ప్రాణం విడిచిపెట్టారు. అంటే ఆయన హృదయం అంతా రామమయం. గాంధీ గారికి అంతపేరు రావటానికి కారణం ఒక మంచి పనికోసం అవసరమైతే ఏ క్షణంలో అయినా ప్రాణం ఇవ్వటానికి సిద్ధంగా ఉండేవాడు. రాముడి గొప్పతనం గురించి ఒకమాట చెపుతాను. ఎక్కడైతే రాముడు ఉన్నాడో అక్కడ కాముడు ఉండడు. రావణా నీకు ఇంటి దగ్గర చాలా అందమైన భార్యలు ఉన్నారు, ఈ సీతమ్మ గురించి ఏడుస్తావేమిటి అని కొంతమంది తిట్టారు. కొంతమంది ఏమని సలహా చెప్పారు అంటే సీతమ్మ నీకు భార్యగా ఉండటానికి అంగీకరించటంలేదు. సీతమ్మచేత నువ్వు ప్రేమించబడాలి అంటే నువ్వు రాముడి వేషం వేసుకొని వస్తే అప్పడు సీతమ్మ నిన్ను ప్రేమిస్తుంది అని సలహా చెప్పారు. అప్పడు రావణాసురుడు రాక్షసుడు అయినా ఒక గొప్పమాట అన్నాడు. ఈ ఒక్క వాక్యం మీరు జ్ఞాపకం ఉంచుకొని మీరు ఇంటికి వెళ్ళిపోవచ్చు. మీరు చెప్పిన సలహా బాగుంది. స్త్రీని పురుషుడు అనుభవించాలన్నా, పురుషుడుని స్త్రీ అనుభవించాలన్నా ఎంతో కొంత కామం ఉండాలి. నువ్వురాముడి వేషం వేసుకొని రా అని సలహా చెప్పారు కాని నేను రాముడి వేషం ధరిస్తే వెంటనే కామం చచ్చిపోతుంది. కామం చచ్చిపోయిన తరువాత సీతమ్మను నేను ఏమి చేసుకొంటాను అన్నాడు. ఇవి రాముడు అంటే ఇష్టం మీద చెప్పిన మాటలుకాదు, రాముడి యొక్క విరోధి చెప్పిన మాటలు.

సీతమ్మను, రాముడిని విడదీయటానికి నువ్వు మాయలేడి వేషం వేసుకొని వెళ్ళు అని మారీచుడికి రావణాసురుడు చెపుతాడు. రావణాసురుడికి మేనల్లుడు మారీచుడు. అప్పడు మారీచుడు ఏమన్నాడు అంటే లంక ఐశ్వర్యంతో తులతూగుతూ ఉంది. ఎవరో స్త్రీ కోసం ఈ ఐశ్వర్యం అంతా ఎలా పాడుచేస్తావు. నువ్వు ఒక్కడివే పాడవటంకాదు మొత్తం రాక్షసజాతినంతా పాడుచేస్తున్నావు. రాముడి గురించి నాకు కొంత తెలుసు. పైకి సామాన్య

మానవుడికింద కనిపించినా కాని ఆయన అతి బలవంతుడు. వాడిచేత తిన్న దెబ్బ నాకు జ్ఞాపకం ఉంది. అందుచేత మావయ్యా వాడి గొడవలలోనికి వెళ్ళవద్దు అని చెప్పాడు. నువ్వు వెళ్ళి తీరాలి అంటాడు రావణాసురుడు. అప్పుడు మారీచుడు మనస్సులో అనుకొంటాడు నేను ఎలాగు చనిపోవటం ఖాయం. వెళితే వాడు చంపేస్తాడు, వెళ్ళకపోతే వీడు చంపేస్తాడు. మారీచుడు రాక్షసుడు అయినప్పటికీ వాడి తెలివితేటలు చూడండి. ఒక దుర్మార్గుడి చేతిలో చనిపోవటం కంటే సత్పురుషుడి చేతిలో చనిపోవటం మంచిది అని అప్పుడు మాయలేడి రూపం ధరించి వెళతాడు. తరువాత సీతమ్మ లక్ష్మణుడిని కొన్ని కఠినమైన మాటలు అంటుంది. సీతమ్మ అలా మాట్లాడవచ్చునా అని మీరు అనుకోవచ్చు. ప్రారబ్ధం అలా మాట్లాడిస్తుంది. మనం విధి చేతిలో కీలుబొమ్మలం. ఈశ్వర నిర్ణయం బలీయమైనది. ఆయన ఏ శరీరాన్ని ఎలా వాడుకుంటాడో మనం చెప్పలేము. ప్రారబ్ధాన్నిబట్టి ఈ దేహాలను నడుపుతూ ఉంటాడు.

సోదర ప్రేమ ఎలా ఉంటుంది, భార్యాభర్తల మధ్య అనురాగం ఎలా ఉంటుంది, శరణాగతి భావం ఎలా ఉంటుంది, భక్తి భావన ఎలా ఉంటుంది ఇవి అన్నీ రామాయణంలో మనకు కనబడతాయి. కొంతమంది పెళ్ళిళ్ళు చేసుకొంటారు. ఏదో యాంత్రికంగా సంసారం చేస్తారు, చనిపోతారు. ఆప్యాయత ఎక్కడ మనకు కనబడదు, ఏదో బండతనంగా ఉంటారు. మనకు మంచితనం లేనప్పుడు ఎదుటివాడిలో మంచితనం ఉన్నా మనం గుర్తించలేము. మీరు ఘనకార్యాలు చేయలేకపోయినా, మీరు ఐశ్వర్యవంతులు కాకపోయినా సర్వభూతహితేరతాః అంటే అందరి క్షేమం కోరుకోండి. ఎదుటివారికి మనం ఏమీ ఇవ్వలేక పోవచ్చు కాని వారి క్షేమం కోరుకోవటంలో దరిద్రం ఎందుకు? మీరు భౌతికంగా ఏమీ సహాయం చేయలేక పోయినా అందరి క్షేమాన్ని కోరుకోండి అని పరమాత్మ చెప్పాడు. ఈశ్వరుడు నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. ఈ జీవకోటిని వారి వారి ప్రారబ్ధం ననుసరించి నియమిస్తున్నాడు. వాడిని శరణు వేడుకో. అటు ఇటు చూస్తావు ఏమిటి? అలా చూడవలసిన అవసరం ఏమిటి? పైకి చూస్తావా, ఎక్కడికి చూస్తావు? భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడు దయాస్వరూపుడు, అనుగ్రహస్వరూపుడు. నీ హృదయంలో ఉన్నవాడిని శరణు వేడుకో, తరిస్తావు, శాంతి సామ్రాజ్యానికి చక్రవర్తి అవుతావు. ఒకవేళ నీకు అనుభవించవలసిన ప్రారబ్ధం ఉన్నా వాడి దయ ఉంటే అది అంతా కరిగిపోతుంది. వాడిని తెలుసుకో, వాడి స్వరూపాన్ని పొందుతావు. వాడు ఎక్కడో లేడు. నీ శరీరంకంటే, నీ ఇంద్రియాలకంటే నీ మనస్సుకంటే అతి దగ్గరగా నీ హృదయంలోనే ఉన్నాడు. వాడికంటే పెద్ద చుట్టం నీకు ఎవడూ లేడు. వాడికంటే నిజమైన స్నేహితుడు ఎవడూ నీకు లేడు. వాడే బంధువు, వాడే స్నేహితుడు. ఇలా పైకి, కిందకి దిక్కులు చూస్తావేమిటి? వాడిని శరణు వేడుకో.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# కాలము

కాలప్రవాహంలో మనము మరొక నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికాం. కాల గమనంలో అనేక సంవత్సరాలు దొర్లిపోతూనే ఉన్నాయి. మనము స్థిరమని భావించే ప్రతివస్తువును కాలం హరిస్తోంది. మన శరీరం కూడా ఒక కాలంలో ఈ భూమిమీదకు వచ్చింది కాబట్టి, కాల రూపంలో ఉన్న జీవితాన్ని సద్వినియోగం చేసుకొని కాలమునకు అతీతమైన స్వరూప అమృతస్థితిని 'తాను'గా 'నేను'గా అనుభవైకవేద్యం చేసుకోవాలి. కాలప్రవాహము మరియు నదీప్రవాహము ఎలాగైతే దేనినీ పట్టించుకోకుండా, నిరంతరం తమ గమ్యంవైపే సాగిపోతాయో, అలాగే మనము హృదయంలో స్వరూపంగా ఉన్న పరమాత్మ వైపే సాగిపోవాలి. అంతర జీవితం ప్రారంభం అవడమే నిజమైన సాధనకు గుర్తు. మనస్సును శుద్ధి చేసుకొని జనన-మరణ సంసార రూప సముద్రంలోంచి విడుదల పొంది, మరల ఇలాంటి దేహాలు రాకుండా జన్మరాహిత్యాన్ని పొందటానికే ఈ భూమి మీదకు వచ్చాం. ఈ భూమి మీదకు వచ్చిన పని అంతకు మించి వేరేదీ లేదు. వాస్తవంగా నేను ఎవరో? తెలుసుకొనుటకు పరమాత్మచే ప్రసాదింపబడిన గొప్ప బహుమతి మానవజన్మ. మోక్షసాధనకు దేహేంద్రియమనోబుద్ధులను చక్కని పనిముట్లుగా ఉపయోగించుకోవాలి. ఒక నదిని దాటుటకు పడవను ఎలాగైతే ఉపయోగించుకొంటామో, అలాగే సంసారసాగరాన్ని గురుబోధ అనే పడవ ద్వారా దాటాలి. యదార్థములో మన స్వరూపము బ్రహ్మమే అయినప్పటికీ, సకల అరిష్టాలకు మూలమైన దేహాత్మబుద్ధి వలన అహంకార మమకారములకు లోనై, జనన-మరణ సంసారచక్రంలో పడి దుఃఖమునకు, అశాంతికి, పునర్జన్మలకు, లోనగుచున్నాము. మానవుడు తాను దేహమాత్రుడను కాదని, వ్యక్తిభావనను విడిచిపెట్టుట ద్వారా తాను అఖండబ్రహ్మమే అనెడి ఏకత్వానుభూతిని పొందుటకొరకే ఈ మానవజన్మ ప్రసాదింపబడినది. కాబట్టి ఇప్పుడే, ఇక్కడే ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, మన త్రికరణాలను స్వస్వరూపానుభూతికి సహకరించేలా మలచుకొని తరించాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# యదార్థమైన ప్రేమ హృదిని కరిగిస్తుంది - వ్యవహారపు ప్రేమ మనస్సును మరిపిస్తుంది

మనం పిలిచే ప్రేమ వ్యసనం, నిజమైన ప్రేమకాదు. అక్కడ మరియొకడు పనిముట్టుగా వాడుకోబోతున్నాడు. అది అతిహేయం, ప్రేమను దుర్వినియోగపరుచుకోవటం. ఉదాహరణకు ఒక రశిక ప్రేమికుడు ప్రియురాలితో "నేను నీ కొరకు చావటానికైనా సిద్ధంగా ఉన్నాను నువ్వు కాదనకు, నిన్ను పొందగలను. ఆకాశంనుంచి అగ్ని వర్షం కురిసినా నిన్ను పట్టుకోగలను అంటే, నిజమని నమ్మింది. ఆ పిల్లను మైధునంలో మురిసి మరలి వెళుతూంటే ప్రేయసి "రేపు వస్తారా!" అంటే "వర్షం పడకపోతే చూద్దాం" అంటాడు. ఇది వ్యవహారిక ప్రేమ. ఈ నిత్యసత్యాలను వార్తాప్రచారసాధనాలలో నిత్యం చూస్తూనే ఉన్నాము. నిజమైన భగవత్ ప్రేమలో రక్తి- వెగటు తెలియదు. ఆ ప్రేమ నేర్చుకొంటే రాదు. మనస్సు పరిణితి వల్ల ఈ సృష్టి అంతా ఉనికిలో ఉందని అవగాహన వల్ల ఆ ప్రేమ కలుగుతుంది. అందమైన భార్య లేదా భర్త కలిగి అందమైన సంతానంతో, అధికారంలో, డబ్బు, గౌరవం అధికంగా ఉన్నప్పడు అహంకారానికి మహాపోషకత్వం అందినట్లు అనిపిస్తుంది. కాని అందాలు, అధికారాలు కరిగి సొంతానికి ఏమీ లేనప్పడు ఆ ప్రేమ మాయమౌతుంది. తదుపరి అసూయ, స్వార్థం, ద్వేషం, క్రోధంతో వికారపూరితమౌతుంది. కామం అనేది జ్వరం. ఏరుకలేనిది, పిచ్చిది, గుడ్డిది, అబద్ధమైనది. సద్గురునుంచి వచ్చేది జీవనగానం. అది ఉనికిగానం. మనకు నకిలీ కోట్లు, నాణాలు, నిజమైనవిగా కనిపిస్తాయి. మానవాళిలో ఎక్కువమంది ఈ నకిలీ ప్రేమని నిజమైన ప్రేమగా నమ్మి జీవిస్తున్నారు. ఇవి అన్నీ ఎండమావులు. జీవితాన్ని ఎదుర్కోవాలి అంటే ఎన్నో కుదుపులు, ముక్కలు కావటానికి సిద్ధంగా ఉండాలి. మన అహంకారాన్ని నాశనం చెయ్యటమే గురువు యొక్క కర్తవ్యం. అది నాశనమైనప్పడు భగవంతునితో సంబంధం కుదురుతుంది. మన గతాన్ని భవిష్యత్ ఊహలను చంపుకోవాలి. అప్పడే యదార్థమైన ప్రేమ కలిగి మన మనస్సును కరిగిస్తుంది. నుయ్యి తవ్వేటప్పడు ఎన్నో పొరలుపొరలుగా మట్టిని, బండరాళ్ళను తొలగిస్తే నీరు ఉబుకుతుంది. నీరు అక్కడ ఎప్పడూ ఉన్నదే అలాగే అరిషడ్వర్గాలు అనే బండరాళ్ళను గురుసహాయంతో తొలగించుకొంటే ప్రేమ వ్యక్తమవుతుంది. ఆ దైవీప్రేమ ఎప్పడూ మనలోనే ఉంది. ఆ అనంతప్రేమకు హద్దులు లేవు. "జుగుప్సాకరమైన కళేబరాల్లో కూడా ఆ అందమైన, ఆనందమైన ప్రేమను చూడగలము" అంటారు అనుభవజ్ఞులు. ఈ పరిణామం కోసమే మన బుద్ధిని తీక్షణంగా మారుస్తాడు మన గురువు. మనలను జడంగా ఉండనియ్యడు. మన మనస్సు రోగిష్టిదని, గందరగోళమైనదని మనకు తెలియజేస్తాడు. మనస్సు అనేది శరీర ధర్మం. శరీరం లేకుండా దానికి ఉనికి లేదు. ఈ విషయంలో గురువుకు మనం సహకరిస్తూ ఆయన చేసే క్రియలకు అనుమతిస్తూ స్వాగతిస్తూ అందుబాటులో ఉండాలి. దూరం కాకూడదు. మన తలుపులు తెరవాలి ఆ ప్రేమ అధికారి రాకకోసం. మనవైపునుంచి ప్రగాఢశ్రద్ధ, విశ్వాసం, నిశ్చయత్వం, గ్రాహ్యత, ప్రేమసమర్పణం కావాలి. మనం స్పష్టంగా ఉండటమే దాన్ని దర్శించటం. దాపరికం లేని కళ్ళు విశాలహృదయమే దర్శించగలుగుతాయి. మనం మెలుకవతో, ఆత్మస్ఫురణతో, అవగాహనతో గ్రాహ్యతతో ఉంటేచాలు ఇందులో మన పాత్ర అంతే. అంతా గురుకరుణాకటాక్షమే మూలము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966**